క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి



ధర్మసాగర్: మండలంలోని రాయిగూడెం గ్రామంలో నెలకొల్పిన సోమలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 13(రేపు)న నిర్వహించే ప్రథమ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ వ్యవస్థాపకులు రామగిరి సోమలింగం ఆచార్య, సోమలక్ష్మి దంపతులు కోరారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సోమలింగేశ్వరస్వామి ఆలయంలో 13న స్వామి పూజ, రుద్రాభిషేకం, పాలాభిషేకం, రుద్రహోమం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద దేవాలయంగా నిర్మాణం చేయడం జరిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

నియామకం



శాయంపేట : తెంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన దిడ్డి రమేష్‌ను నియమితులయ్యారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, ఆడెపు రవీందర్ మంగళవారం రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర, జిల్లా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలీ కుల అభ్యున్నతికి కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కో ఆర్డినేటర్ పులికంటి రాజేందర్, పసునూటి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కాజీపేట : చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు వెయ్యి దీపాలతో అలంకరించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్, వడ్డెపల్లి నరేందర్, తిరునగరి దిలీప్ కుమార్, ఐలోని వెంకట మల్లారెడ్డి, పెద్ది అశోక్ కుమార్, శనిగరపు సుజాత, వంగాల సత్యనారాయణ రెడ్డి, రాచర్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

30శాతం బడ్జెట్ కేటాయించాలి



ఖిలా వరంగల్ : రానున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30శాతం బడ్జెట్ కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ కోరారు. వరంగల్ ఉర్సుగుట్టలోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ అధ్యక్షతన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఏటా విద్యారంగానికి నిధులు కేటాయించకుండా పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశంలో సీహెచ్ రంగయ్య, అరూరి కుమార్, సింగారపు బాబు, వల్లదాసి దుర్గయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



మహేందర్, అధ్యక్షుడు

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా మినీ వ్యాన్ (డీసీఎం) ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా తాళ్లపల్లి మహేందర్ ఎన్నికయ్యారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఆరె రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేష్, కోశాధికారిగా వంచ రంగారెడ్డి, సహాయ కార్యదర్శిగా పోతుల రాజ కొమురయ్య ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘ఆఖిరి’ అవస్థలు..

శ్మశానవాటికల్లో తప్పని తిప్పలు
- చీకటిమయం.. నీటి కొరత
- వాహనాల హెడ్‌లైట్లే దిక్కు..
- పలుచోట్ల దారి సైతం లేనివైనం



దామెరలో ధ్వంసమైన శ్మశానవాటిక గేటు

దామెర: మనిషి మరణించిన తర్వాత చివరి మజిలీ ప్రశాంతంగా నిర్వహిస్తే ఆత్మకు సంతృప్తి కలుగుతుందనేది ఓ నమ్మకం. ఒక్కో శ్మశానవాటికకు సుమారు రూ.12.60 లక్షల అంచనా వ్యయంతో గత ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల నుంచి కేటాయించి మండలంలోని 14 గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టింది. కానీ, పర్యవేక్షణ లోపంతో శ్మశానవాటికలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కొన్ని గ్రామాల్లో పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజల అవస్థలు తప్పడంలేదు.

మృతదేహం ఖననం చేసిన అనంతరం వారి బంధువులు స్నానాలు చేయాలంటే చాలాచోట్ల నీటి వసతిలేని పరిస్థితి. మండల కేంద్రంలో ఒక హ్యాండ్ బోర్ మాత్రమే ఉండడంతో ఎక్కువ మంది వచ్చిన సందర్భంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు తెప్పించుకొని స్నానాలు చేసే దుస్థితి నెలకొంది. ఓగ్లాపూర్ శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో చినుకు పడితే చిత్తడిగా మారి అందులో నుంచే శవయాత్ర నిర్వహించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గంపేట్ శ్మశాన వాటికలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో కారు లైట్ల సాయంతో ఇటీవల దహన కార్యక్రమాలు నిర్వహించారంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల దుస్తులు మార్చుకోవడానికి షెడ్లు సరిగా లేకపోవడంతో మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు. ల్యాదెళ్ల, కోగిల్వాయి, ఊరుగొండలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో ప్రదక్షిణలు చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి శ్మశానవాటికల నిర్వహణపై దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



దుర్గంపేట్‌లో కారు లైట్ల వెలుతురులో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న బంధువులు (ఫైల్)

ఇబ్బందులు లేకుండా చేయాలి



మండలంలో శ్మశానవాటికలు నిర్మించి చేతులు దులుపుకున్నారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో దహన సంస్కారాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు దృష్టిసారించి మౌలిక సౌకర్యాలు కల్పించాలి.

– వేల్పుల రాజ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పిచ్చి మొక్కలు తొలగించడాన్ని పరిశీలిస్తున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆత్మకూరు సీఐ సంతోష్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు నుంచి వరంగల్ వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా చేయించి, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను ఇబ్బందికి గురి చేయొద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, కానిస్టేబుళ్ల తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. 17 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు పర్వతగిరి రాజు, కంచ రవికుమార్, స్వామి, రాధిక, రాజు, రవీందర్‌గౌడ్, కృష్ణంరాజు, రవి, కేదారి, రాజమౌళి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే తెలియజేయాలి

- ఏడీఈ రాజేశ్వర్‌రావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ రాజేశ్వర్ రావు

వేలేరు: మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ సమస్యలు ఉంటే రైతులు.. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని భీమదేవరపల్లి ఏడీఈ రాజేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయ క్షేత్రాల్లోని ఎస్ఎస్ 31,100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కింద రైతులకు అధికారులు విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించారు. పొలాల వద్ద ఎపేలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా సొంతంగా రైతులే చేసుకోకుండా విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ కుమారస్వామి, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. పరకాల డివిజన్ కేంద్రంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ పరకాల డివిజన్ పూర్వ బాధ్యుల సమావేశం నిర్వహించారు. సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1970 సంవత్సరంలో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలపై పోరాటాలు చేస్తోందన్నారు. అప్పటి నుంచి 2016 వరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన పూర్వ నాయకులతో చేపట్టనున్న మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జి.గంగాధర్, డి.తిరుపతి, పరకాల డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్, ఆకుల రుద్ర ప్రసాద్, నక్క చిరంజీవి, మైస సురేందర్, కోగిల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్.. అక్రమ నిర్మాణలపై ప్రత్యేక దృష్టి

- ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ లక్ష్యం
- సాక్షి ఇంటర్వ్యూలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

సాక్షి INTERVIEW



వెంకటేష్, కమిషనర్

పరకాల: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం జరిగితే ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడినట్లే.. అక్రమ నిర్మాణాలతో మున్సిపాలిటీ ఆదాయం తగ్గి.. అభివృద్ధికి ఆటంకం కలుగుంది. అందుకే ఈ రెండు ప్రధాన విషయాలుగా పరిగణించాల్సి ఉంటుందని పరకాల మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్ వెంకటేశ్ సాక్షి ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

సాక్షి: పరకాల మున్సిపల్ కమిషనర్‌గా నెల రోజుల్లో గుర్తించిన సమస్యలేంటి?

కమిషనర్: శానిటేషన్‌లో లోపాలు ఉన్నాయి. స్వచ్ఛ వాహనాలు పనిచేయకపోవడం వల్ల చాలా కాలనీల నుంచి ఫిర్యాదు వచ్చాయి. మూడు వాహనాలను మరమ్మతు చేయించాం. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

సాక్షి: శానిటేషన్ సిబ్బంది కొరతపై తీసుకున్న చర్యలు ఏంటి?

కమిషనర్: 22 వార్డులకు మున్సిపాలిటీలో ఉన్న సిబ్బంది సంఖ్య తక్కువ. రోడ్లు క్లీన్ చేసే హెవీ వెహికిల్ పనిచేయకపోవడం కూడా ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారులకు తెలియజేసి సిబ్బందిని పెంచుతాం. లేదా.. వాహనానికి మరమ్మతు చేయిస్తాం.

సాక్షి: ప్లాస్టిక్ నివారణ చర్యల్లో విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమిషనర్: అలాంటిదేమి లేదు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు జరుగుతున్న సర్వేల్లో మున్సిపల్ ఉద్యోగులు పనిచేయడం జరుగుతుంది. వారం రోజుల్లో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ నివారణ చర్యలు తీసుకుంటాం.

సాక్షి: మున్సిపల్ ఆదాయం చాలా తక్కువగా ఉండటంపై చర్యలు..

కమిషనర్: వాస్తవమే.. పరకాల మున్సిపాలిటీ ఆదాయం పెంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం, ట్రేడ్ లైసెన్స్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులందరూ ఫీజు చెల్లించేలా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇతరత్రా కార్యక్రమాల ద్వారా ఆదాయం పెంచడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

సాక్షి: అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టారు?

కమిషనర్ : పరకాల మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణం జరిగినా సహించేది లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులను అప్రమత్తం చేయడంతోపాటు స్వయంగా అక్రమ నిర్మాణాలను పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

సాక్షి: వేసవి తాగునీటి ఎద్దడి నివారణ చర్యలేమిటి?

కమిషనర్: ఇప్పటికే వాట్సాప్ గ్రూపు ద్వారా కాలనీలకు మంచినీరు అందుతుందా.. లేదా.. పరిశీలించడం జరుగుతుంది. ఎక్కడ కూడా లీకేజీలు లేకుండా, నీటి వృథా లేకుండా చర్యలు తీసుకుంటాం.

సీసీ కెమెరాలతో బాలిక ఆచూకీ లభ్యం



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై

పరకాల: మతిస్థిమితం లేని ఓ బాలిక తప్పిపోగా.. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. పరకాల బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధంచి ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి వెన్నెల మతిస్థిమితం లేక పరకాల బస్టాండ్ నుంచి ఎక్కడికో వెళ్లిపోయిందని పరకాల సీఐ క్రాంతికుమార్‌కు ఆమె సోదరుడు చొల్లేటి శివ ఫిర్యాదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు హోంగార్డు సుధాకర్ సీసీ పుటేజీ ద్వారా బాలికను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కమలాపూర్ : రిలే నిరాహార దీక్షలో నాయకులు



మాట్లాడుతున్న బొడ్డు శాంతిసాగర్

- రిలే నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

కమలాపూర్: ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని, అప్పటి వరకు అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిలిపి వేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ఒకరోజు రిలే నిరాహార దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2024 ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వగానే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, చరిత్రలోనే ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి సీఎంగా ఉంటానని, అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం తన మాట నిలుపుకోవాలన్నారు. త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల రమేష్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్, నాయకులు ఇంసపెల్లి రమేష్, శనిగరపు జనార్దన్, ఐలయ్య, అల్లకొండ శంకర్, వక్కల రమేష్, రాజమల్లు, స్వామి, కుమార్, నరేష్, వీరేశం పాల్గొన్నారు.

శాయంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ 123 కాకుండా ఏబీసీడీ వర్గీకరణ చేసి ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల స్టీరింగ్ కమిటీ చైర్మన్ ముక్కెర ముఖేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎస్ఎస్ఎఫ్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మామిడి భాస్కర్ ఆధ్వర్యంలో రిలే నిరహారం దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల స్టీరింగ్ కమిటీ చైర్మన్ ముక్కెర ముఖేష్, అరికిల్ల దేవయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేస్తూ మాదిగలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏబీసీడీలుగా విభజించి న్యాయం చేయాలి

మామునూరు/ఐనవోలు: ఏబీసీడీలుగా విభజించి జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు రావాల్సిన వాటా ఇచ్చి న్యాయం చేయాలని మాదిగ ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఐనవోలు మండలం కేంద్రంలో ఎంఎస్పీ అనుబంధ సంగాల అధ్యక్షులు చింత అశోక్, ఇసురం బాబు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నారాయణ హాజరై మాట్లాడారు. బర్ల బాబు, కట్కూరి రమేష్, చంద్రమౌళి, మరిపట్ల దేవదాస్, ఆరోగ్యం, మరిపట్ల దేవదాస్, అరూరి కుమారస్వామి, అనిల్, కరుణాకర్, సాగర్ పాల్గొన్నారు.

ఉద్యోగాల నియామక ప్రక్రియ నిలిపివేయాలి

ధర్మసాగర్: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు ఉద్యోగాల ప్రక్రియ నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం 3వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండానే ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణ ద్వారా మాత్రమే ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని, వర్గీకరణతో కూడిన ప్రభుత్వ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. నాయకులు సోంపెల్లి అన్వేష్, మాదాసి యాదగిరి, సారయ్య, ప్రశాంత్, రాజు, సుమన్, బాబు, భాస్కర్, శ్రావణ్, ప్రవీణ్, భిక్షపతి, శౌరి తదితరులు పాల్గొన్నారు.

సూరంపేట హనుమాన్ గుడిలో చోరీ



దుండగులు పగులగొట్టిన హుండీ

శాయంపేట : మండలంలోని సూరంపేట గ్రామంలోని హనుమాన్ గుడిలో మంగళవారం చోరి జరిగినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పావురాల సారంగం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. దేవాలయంలో ప్రతి రోజూ మాదిరిగానే సోమవారం పూజలు ముగిసిన అనంతరం గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లారు సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళాలు, హుండీ తాళాలను పగుల గొట్టి హుండీలోని డబ్బులను అపహరించినట్లు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన హనుమాన్ భక్తుడు పొడాల కిష్టయ్య హనుమాన్ గుడిలో దేవుడికి దీపం పెట్టడానికి మంగళవారం తెల్లవారుజామున గుడి వద్దకు రాగా గుడి తాళాలు పగులగొట్టి ఉండడంతో సారంగానికి సమాచారం అందించాడు. తాను వచ్చి చూసేసరికి గుడి తాళం, హుండీ పగుల గొట్టి ఉంది. హుండీలో ఉన్న సుమారు రూ.10 వేలు అపహరణకు గురయ్యాయని, శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చైర్మన్ సారంగం తెలిపారు.

రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం..

- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి



గండ్ర వెంకటరమణా రెడ్డితో మాట్లాడుతున్న ఈఈ సునీత

శాయంపేట : రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని, రైతుల కోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. మండలంలోని చలివాగు ప్రాజెక్టులో మోటార్లు బంద్ చేయాలని మంగళవారం పంపుహౌజ్ ఎదుట బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణా రెడ్డి పంపుహౌజ్ సీఈ అశోక్‌కుమార్‌కు ఫోన్ చేసి చలివాగు ప్రాజెక్టులో కనీసం 15 అడుగుల నీటి మట్టం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. చలివాగు ఆయకట్టు పంటలకు సాగునీరు విడుదల చేసిన తర్వాతే ధర్మసాగర్‌కు నీటిని పంపిణీ చేయాలని కోరారు. దీంతో సీఈ సమాచారం మేరకు ఈఈ సునీత.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి వద్దకు వచ్చి ఆరు రోజుల లోపు చలివాగులో 15 అడుగుల నీటి మట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాలోచిత పరిపాలన వల్ల రైతులు నిరాశలో ఉన్నారని అన్నారు. దాదాపు నెల రోజుల పాటు చలివాగు ప్రాజెక్టులోకి నీటి పంపిణీ జరుగలేదని, కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన రూ.5 కోట్ల బిల్లు చెల్లించకపోవడంతో, వర్కర్స్‌కు జీతాలు ఇవ్వకపోవడంతో పంపింగ్ బంద్ చేయడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చలివాగు పంప మోటార్లు బంద్ పెట్టి చలివాగు ఆయకట్టు పొలాలకు నీటిని విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. పంపుహౌజ్ నుంచి ధర్మసాగర్‌కు నీటిని పంపింగ్ చేసి ఇక్కడి పొలాలను ఎండగొడితే ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారాన్ని ప్రభుత్వం రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దామోదర్

గీసుకొండ : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ కోరారు. మండలంలోని కొమ్మాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ‘మాదక ద్రవ్యాలు–దుష్పరిణామాలు’పై మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణ, పోటీతత్త్వం అలవర్చుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నతంగా ఎదిగే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని చెప్పారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, బలహీనతలను జయించాలని కోరారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ అక్తర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న అర్చకులు

గీసుకొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన సందర్భంగా పింగిళి శ్రీపాల్‌రెడ్డి మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మండలంలోని శాయంపేట హవేలీ జెడ్పీ హైస్కూల్‌లో గతంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలయంలో మొక్కుకున్న నేపథ్యంలో గెలిచాక వచ్చినట్లు తెలిపారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అడప రామారావు, యుగేంధర్, కల్లూరి వెంకటేశ్వర్లు, ఉడత రాజేందర్, మోహన్‌రావు, రతన్ సింగ్, రవీందర్ రెడ్డి, మాలతి, స్వరూపరాణి, రామ్మూర్తి సన్మానించినవారిలో ఉన్నారు.